క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 30, పచ్చిమిర్చి 50, బెండ 40, కాకర 60, దొండ 30, దోస 30, ఆలు 25, చామ 50, కీర 30, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 100, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 25, క్యారెట్ 50, చిక్కుడు 70, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 40 సొరకాయ (కేజీ) 30, అల్లం 220, వెల్లుల్లి 140.

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి సన్మానం



మహిపాల్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న కాలనీవాసులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని చైతన్య కాలనీలో లోఓల్టేజీ సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని కాంగ్రెస్ జిల్లా నాయకులు కోల్కూరి విజయభాస్కర్‌రెడ్డి, కాలనీవాసులు బుధవారం సన్మానించారు. ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ.42లక్షలతో విద్యుత్ సమస్యను పరిష్కరించారు. దీంతో నాయకులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 12 మందికి కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 11 మందికి నిర్వహించారు.

గోపన్‌పల్లి నుంచి గురుకుల పాఠశాలకు 6 మంది ఎంపిక

రాయదుర్గం: ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలకు గోపన్‌పల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఆరుమంది విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలలో నాల్గవ తరగతి చదివే విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం యాదగిరి, ఉపాధ్యాయులు పాండు, మొగులయ్య, ఉమాదేవిల పర్యవేక్షణలో ఏడాదిపొడవునా విద్యార్థులకు గురుకులాల ప్రవేశ పరీక్షపై శిక్షణ ఇచ్చారు. దీంతో నాల్గవ తరగతి చదివే చరణ్, భవ్యశ్రీ, భానుశ్రీ, చందన, హరిణి, నిఖిల్ సిద్దార్థ్‌లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం యాదగిరి, పాండు, మొగులయ్య మాట్లాడుతూ ప్రతియేటా గురుకులాల ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులోనూ ఈ రకమైన శిక్షణను కొనసాగిస్తామన్నారు.

ఆర్థికసాయం అందజేత

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని పాశమైలారం పారిశ్రామికవాడలోని పార్లే ఆగ్రో పరిశ్రమలో పని చేస్తున్న కార్మికుడు సికిందర్ కూతురు కీర్తి కొంతకాలంగా బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఎంఆర్ యువసేన సభ్యులు వెంకటేష్ తన మిత్రులతో కలిసి బుధవారం రూ.20 వేలు ఆర్థికసాయంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్‌ను ఆదర్శంగా తీసుకొని సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీశైలంచారి, సతీష్, రవి, లక్ష్మణ్, అంజయ్యగౌడ్, ప్రభు పాల్గొన్నారు.

కాలనీలు, బస్తీల్లో బోలెడు సమస్యలు



గచ్చిబౌలి: గడపగడపకూ బీజేపీ కార్యక్రమానికి శేరిలింగంపల్లిలో విశేష స్పందన లభిస్తోంది. బుధవారం 44వ రోజు కొండాపూర్ డివిజన్‌లోని రాఘవేంద్రకాలనీ బీబ్లాక్, ఏ బ్లాక్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ శేరిలింగంపల్లిలోని అన్ని కాలనీలు, బస్తీలలో ఎన్నో సమస్యలు ఉన్నాయని.. ఇది నాయకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ముఖ్యంగా రోడ్లు, మంచినీళ్ళు, డ్రైనేజీ , స్ట్రీట్ లైట్స్ తదితర సమస్యలు నెలకొన్నాయన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీజేపీ విజయం సాధించడం ఖాయమన్నారు. అంతకుముందు స్థానిక ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌యాదవ్, ఆంజనేయులు, ఎల్లేష్, రాధాకృష్ణయాదవ్, అనిల్‌కుమార్‌యాదవ్, నరసయ్య, కృష్ణ, ప్రకాశ్, మల్లేష్, నరేష్, రాజేందర్, మల్లేశ్వరి, పద్మ, పార్వతి,తోపాటు పలువురు పాల్గొన్నారు.

డ్రోన్ల ఆవిష్కరణ

హఫీజ్‌పేట్: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని మెజ్లానిక్ క్లౌడ్ కార్యాలయంలో అత్యాధునిక డ్రోన్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఈఓ సుధీర్‌రెడ్డి తుమ్మా సంస్థ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. డ్రోన్లు మానవ మార్గదర్శకత్వం లేకుండా పని చేసేవన్నారు. ఈ లాజిస్టిక్స్ డ్రోన్‌లు 5 నుంచి 60 కిలోమీటర్ల వరకు పనిచేయగల సామర్థ్యంతోపాటు 2 నుంచి 100 కిలోల మధ్య కార్గో పేలోడ్‌లను మోయగలవి కావడం మరో విశేషమన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

బ్రాహ్మణ సదన్ ప్రారంభానికి తరలివచ్చిన పీఠాధిపతులు, వేద పండితులు

గచ్చిబౌలి/హఫీజ్‌పేట్: బ్రాహ్మణ సదన్ ప్రారంభోత్సవానికి బుధవారం పలువురు పీఠాధిపతులు, వేద పండితులు హాజరయ్యారు. వారికి నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి మహాస్వామి, తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన పీఠాధిపతులు, వేద పండితులు, అర్చకులు, బ్రాహ్మణులు, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యులు తరలివచ్చారు.

2017లో శంకుస్థాపన... ఇప్పుడు ప్రారంభోత్సవం

- గోపన్‌పల్లిలో విప్రహిత బ్రాహ్మణ సదన్' నిర్మాణానికి 6.25 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది.
- ఈ స్థలంలో రూ.12 కోట్ల వ్యయంతో 'విప్రహిత బ్రాహ్మణ సదన్'ను నిర్మించారు.
- 2017 జూన్ 5న మంత్రి కేటీరామారావు శంకుస్థాపన చేయగా, బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రారంభించారు.

చండీయాగం.. పూర్ణాహుతి..

- విప్రహిత బ్రాహ్మణ సదన్ ప్రాంగణంలో ప్రత్యేక యాగశాలలు ఏర్పాటు చేసి చండీ యాగం వైభవంగా నిర్వహించారు.
- అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.





సౌకర్యాలు.. భవిష్యత్ ప్రతిపాదనలు..

- బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నిర్మించిన బ్రాహ్మణ సదన్‌లో 4 భవనాలు నిర్మించారు.
- పరిపాలనా భవనం, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన కల్యాణ మండపం, ఆడిటోరియం, గెస్ట్ రూమ్స్, టాయిలెట్స్ బ్లాక్స్ నిర్మించారు.
- సమాచార కేంద్రం, పీఠాధిపతులు, ధర్మాచార్యుల సదనం, భక్తి, ఆధ్యాత్మిక భావజాల వ్యాప్తికి సంబంధించి సమస్త సమాచార కేంద్రం , రిసోర్స్ సెంటర్‌గా ఈ సదన్ సేవలందిస్తుంది.
- ఆధ్యాత్మిక గ్రంథాలు, వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, సాహిత్యంతో కూడిన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు.
- ఈ సదన్‌లో బ్రాహ్మణుల వివాహాలు, ఉపనయనం చేసుకోవచ్చు.
- భవిష్యత్‌లో ఉన్నత చదువులకు విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించడం, పోటీ పరీక్షలకు కోచింగ్ క్లాసుల నిర్వహణతో బాటు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా లైబ్రరీ కూడా అందుబాటులోకి తేవాలనే ప్రతిపాదనలున్నాయి.



దశాబ్ది ఉత్సవాలు.. పండగలా చేయాలి

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- కార్పొరేటర్లు, అధికారులతో సన్నాహక సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు శేరిలింగంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సూచించారు. బుధవారం మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జోనల్ కమిషనర్ శంకరయ్య, సర్కిల్ డీసీలు వెంకన్న, సుధాంశ్, కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, జగదీశ్వర్‌గౌడ్, నార్నె శ్రీనివాస్‌రావు, ఉప్పలపాటి శ్రీకాంత్, రోజాదేవి రంగారావు, సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గంలో కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు అందరు సమన్వయంతో పనిచేయాలన్నారు. జూన్ 2వ తేదీ నుండి 22 తేదీ వరకు ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్య కోసం జరుగుతున్న కృషిని మన ఊరు- మన బడి కింద పాఠశాలలో వచ్చిన మార్పును నాడు, నేడు ఫోటోలతో ప్రదర్శించాలని తెలిపారు. విద్యార్థులకు వ్యాస రచన, చిత్ర లేఖనం, పాటల పోటీలు నిర్వహించాలన్నారు. జూన్ 20న పాఠ్య పుస్తకాలు, దుస్తులు విద్యార్థులకు అందించడం జరుగుతుందన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో 9 ఏళ్ల పాలనలో ఎంతో అభివృద్ధి చెందిందని, సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశంలో నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. ఈ సమావేశంలో మాదాపూర్ సీఐ తిరుపతి, ఎస్ఈ వెంకన్న, డిప్యూటీ డీహెచ్‌అండ్‌హెచ్ఓ సృజన, డిప్యూటీ డైరెక్టర్, సీడీపీఓ లక్ష్మీబాయి, ఇరిగేషన్ డీఈ నళిని, జలమండలి జీఎం రాజశేఖర్, డీజీఎం నాగప్రియ, శరత్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి మోంట్రా సూపర్ ఎలక్ట్రిక్ ఆటో



కార్యక్రమంలో సంస్థ సీఈఓ సుశాంత్ జెనా, యుక్తా మోటార్స్ డీలర్ గోపాల్‌రెడ్డి

గచ్చిబౌలి: మురుగప్ప గ్రూపునకు చెందిన మోంట్రా ఎలక్ట్రిక్ సూపర్ ఆటోను మార్కెట్‌లోకి విడుదల చేశారు. బుధవారం రాయదుర్గంలోని యుక్తా మోటార్స్ షోరూమ్‌లో మోంట్రా సూపర్ ఆటోను మోంట్రా ఎలక్ట్రిక్ సీఈఓ సుశాంత్ జెనా, యుక్తా మోటార్స్ డీలర్ గోపాల్‌రెడ్డి విడుదల చేశారు. సుశాంత్ మాట్లాడుతూ ఒక్కసారి రీచార్జ్ చేస్తే 197 కిలోమీటర్లు నడుస్తుందన్నారు. ఎక్స్ షోరూమ్ ధర మూడు లక్షల రెండు వేలు ఉందన్నారు.

పొగాకు వినియోగంలో భారత్ రెండవ స్థానంలో ఉంది

టిమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇషాన్ అహ్మద్‌ఖాన్



స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఇషాన్ అహ్మద్‌ఖాన్, రామస్వామి యాదవ్

రాయదుర్గం: పొగాకు ఉత్పత్తుల వినియోగంతో ప్రపంచంలో ప్రతియేటా 8 మిలియన్ల మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని గచ్చిబౌలిలోని టిమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇషాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. ప్రంచవ్యాప్తంగా పొగాకు వినియోగంలో భారత్ రెండవ స్థానంలో ఉందన్నారు.గచ్చిబౌలిలోని టిమ్స్ ఆస్పత్రిలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆ సంస్థ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్టిక్కర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది 'మనకు ఆహారం కావాలి- పొగాకు కాదు' అనే నినాదంతో నిర్వహించడం జరుగుతోందన్నారు. పొగాకు ఉత్పత్తులను వినియోగించడంతో ఊపిరితిత్తులు, గొంతు క్యాన్సర్, గుండెపోటు, రక్తపోటు, మధుమేహం, కంటి చూపు మందగించడం లాంటి 21 వ్యాధులు సంభవిస్తాయన్నారు.యువత చెడు అలవాట్లుకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మా రబోయిన సదానంద్‌యాదవ్, జనార్దన్, కె బాలన్న, వాణి సాంబశివరావు, మల్లేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



సాయిదత్త గణపతి ఆలయంలో హోమం

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో బుధవారం తొమ్మిదవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాబాకు కాగడహారతి, గణపతి పూజతో వార్షికోత్సవ పూజలు ఆరంభించారు. అనంతరం ఆలయంలో పుణ్యాహవచనం, మండపారాధన,గణపతి, దత్తాత్రేయ స్వామి, షిర్డీసాయిబాబా వారికి పంచామృతాభిషేకం, మంగళ స్నానాలు, రుద్రహోమం, నవగ్రహ హోమం, ప్రతిష్టామూర్తుల హోమం, పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. సామూహిక విష్ణు సహస్రనామసహిత లక్ష్మీ అష్టోత్తర పారాయణం, సాయిచాలీసా, నక్షత్రమాలిక పారాయణం నిర్వహించారు. భజన కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి శేజ్ హారతితో వేడుకలు ముగిశాయి. ఆలయ కమిటీ నిర్వాహకులు డి రవీందర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, ఆలయ అర్చకులు వివివిఎస్‌శర్మ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘన నివాళి

రాయదుర్గం: కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి మాజీ అధ్యక్షుడు కొమిరిశెట్టి మాణిక్‌రావుకు బుధవారం ఘనంగా నివాళులు అర్పించారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, పలువురు నాయకులు, కొమిరిశెట్టి ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానికులు, కుటుంబసభ్యులు పాల్గొని నివాళులు అర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.



మాణిక్‌రావుకు నివాళులు అర్పిస్తున్న నాయకులు, కుటుంబసభ్యులు

ఫారమ్స్ డే ఈవెంట్...



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఆర్థిక సేవల కార్పొరేట్ కంపెనీ సింక్రోనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫారమ్స్ డే ఈవెంట్ ఆకట్టుకుంది. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీ నోవోటెల్ హోటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా విందు, వినోదాలు సందడిగా సాగాయి. మల్ల ఖంబా యాక్ట్, దివ్యాన్స్, మనురాజ్‌ల ప్రత్యేక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్పొరేట్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తల్లీ,కొడుకు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: తల్లీకొడుకు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన అశోక్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం అశోక్ డ్యూటీకి వెళ్లే సమయంలో భార్య జ్యోతి, రెండున్నర సంవత్సరాల కుమారుడు పండరి ఇద్దరు ఇంట్లో ఉన్నారు. తిరిగి రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో భార్య, కుమారుడు కనిపించలేదు. భార్య నంబరుకు ఫోన్ చేసి చూడగా స్విచ్ ఆఫ్ వచ్చింది. తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు. అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి మృతి

పటాన్‌చెరు టౌన్: పడుకున్న చోటే యువకుడు మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పశ్చిమబెంగాల్‌కు చెందిన రబిసింగ్ (23) రెండు నెలల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు శివారులోని ఏపీఆర్‌లో కాంట్రాక్ట్ లేబర్‌గా పని చేసుకుంటూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం రబీసింగ్ పడుకున్న చోటే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకు నూతన క్రీడా పాలసీ

సీఎం కప్ ముగింపు సభలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి



విజేత జట్లకు జ్ఞాపికను అందిస్తున్న విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

గచ్చిబౌలి: అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడాకారులు రాణించేలా నూతన క్రీడా పాలసీని రూపొందిస్తున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం గచ్చిబౌలి స్టేడియంలో సీఎం కప్ ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ క్రీడల కోసం సబ్ కమిటీని ఏర్పాటు చేశారని, తెలంగాణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా నూతన క్రీడా పాలసీ రూపొందిస్తున్నారని తెలిపారు. ఓటమిని విజయంగా మార్చుకునే శక్తి క్రీడాకారులకే ఉంటుందన్నారు. అనంతరం హాకీ విన్నర్‌గా నిలిచిన సంగారెడ్డి, రన్నర్ నిజామాబాద్, ఫుట్‌బాల్ విజేత ఖమ్మం, రన్నర్ నల్గొండ బాలురు, బాలికల జట్లకు మంత్రి బహుమతులు అందజేశారు.

కేసీఆర్ రాకతో చందానగర్‌లో భారీ బందోబస్తు

- దేవాలయం రోడ్డులో మూడున్నర గంటల పాటు దుకాణాలు మూసివేత
- కట్టుదిట్టమైన పోలీసు భద్రత



చందానగర్ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బందోబస్తులో పోలీసులు

మియాపూర్: చందానగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి సీఎం కేసీఆర్ రాక సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామివారిని సీఎం కేసీఆర్ కలిసేందుకు వస్తున్నారన్న సమాచారం అందడంతో చందానగర్‌లోని మంజీరా రోడ్డు, దేవాలయం చుట్టుపక్కల కట్టుదిట్టమైన బందోబస్తు కల్పించారు. సీఎం కాన్వాయిలు వచ్చే మార్గంలో చందానగర్ అను ఫరిచర్ నుండి ఆలయం రోడ్డులో ముందుగానే దుకాణాలను పోలీసులు మూసి వేయించారు. వాహనాలు, జనం నిలబడకుండా చర్యలు తీసుకున్నారు. కాగా సీఎం కేసీఆర్ సుమారు 40 నిమిషాల పాటు ఆలయంలో స్వామిజీతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి వెళ్లే వరకు ఆ రోడ్డు వెంబడి దుకాణాలు తెరుచుకోలేదు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇక్రిశాట్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఇక్రిశాట్ రెండవ గేటు వద్ద కాంట్రాక్ట్ కార్మికులు చేస్తున్న ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం స్పందించి కార్మికుల శ్రమకు తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, శ్రీనివాస్, శాంతమ్మ, రాజశేఖర్‌రెడ్డి, సతీష్‌గౌడ్, పీటర్ పాల్గొన్నారు.

మంజీరా రోడ్డు గుంతలమయం





మియాపూర్: చందానగర్‌లోని మంజీరా రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్సరం ఈ రోడ్డులో ఇండియన్ గ్యాస్ గోడౌన్ నుండి క్రిస్టల్ గార్డెన్ వరకు రోడ్డు తవ్వి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టారు. పైపులైన్ పనులు పూర్తయిన తరువాత కాంట్రాక్టర్లు గుంతలను అడ్డదిడ్డంగా పూడ్చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు వాహనాల రాకపోకలతో పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. దీంతో ఆ రోడ్డు వెంబడి వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మధ్యలో మ్యాన్‌హోళ్లు కూడా ఒక అడుగు ఎత్తులో ఉండడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.